పద్మాక్షి

శారదాశ్రమమున నుండు విద్యార్థు లందఱిలో ప్రద్యుమ్నుఁడే మిగుల తెలివి కలవాఁడును, మిగుల దరిద్రుఁడును.

ప్రద్యుమ్నుని తండ్రిప్రమోదుఁడు మహాతపస్వి. అతఁడు తపస్సుచేయని క్షేత్రమే లేదు. అతఁడు భారద్వాజాశ్రమమునఁ బండ్రెండేండ్లు తపస్సుచేసి వచ్చినపిదప కలుగఁ బట్టి ప్రద్యుమ్నుఁ డింత మేధావియైనాఁ డని విద్యార్థులు వివిధ విధముల చెప్పికొందురు.

కాసంత కటికనేలయేని లేకపోవుటయే ఆ యింట ఆఁడువారివద్దనుండియు అంబుభక్షణ, పర్ణభక్షణ పూర్వమగు తపస్సుచేయుటకు హేతువని తీవ్రవిమర్శకులు వాదించినను, కొంత ఆఁకటితపస్సు క్రింద విలియాపడినను, కొంత యథార్థము కాకపోదని పలువురనుకొందురు. వారి శరీరములు చూచుచో అంతయు యథార్థమేయని యందఱును ఒప్పుకొందురు.

ప్రమోదునకిపు డెనుబదియేండ్లు. అతని భార్య ఆమోద కఱువదేండ్లు. ఆ దంపతులిపుడు భూప్రదక్షిణమునకు బయలుదేఱఁ దలఁచుచున్నారు. అట్టి ప్రదక్షిణములు ఇదివఱకు రెండుమాఱులు అయినవి.

ప్రమోదునిలో పర్వతపు పవిత్రత, మఱ్ఱిచెట్టు రాచఱికము, ఉదయసూర్యుని తేజమును కలవు. దుర్వాసుని కోపము వీనికన్నిటికి మకుటముగా కలదు.

ప్రమోదునియందలి కోపము తీసివైచి యశోదాప్రేమ కలిపినచో నామోదయగును.

ప్రద్యుమ్నునకు విద్యాదీక్ష అయిపోయినది. అనఁగా వివాహమునకు పట్టా పుట్టిన దన్నమాట. అతఁడు స్వగృహోన్ముఖుఁడాయెను.

గురుకులమునుండి గృహోన్ముఖుఁడగు విద్యార్థి యానందమునకు మేరలేదు. అతఁ డు తనకుటీరమున స్వర్గసుఖ మనుభవించును. జీవన్ముక్తునివలె సంచరించును.

మునిపల్లెలో ఆత్మారామునియిల్లు అతిథులకోసమే కట్టఁబడినదని అంద ఱనుకొందురు. అతని కూఁతు పద్మాక్షికి అతిథుల కర్ఘ్యపాద్యము లిచ్చుటతోడనే దినమంతయు సరిపోవుచుండును. ప్రద్యుమ్నుఁ డాయూర నాఁగి వారిముంగిటికి వెళ్లువఱకు పద్మాక్షి పాద్య మిచ్చుట కెదురుగా వచ్చెను. పద్మాక్షిని జూడ ప్రద్యుమ్నునకు

రెండుకనులును చాలలేదు. తన యిచ్చిన పాద్యము గ్రహింపక నిలువఁబడియున్న ప్రద్యుమ్నుఁడు పద్మాక్షికి కానఁబడుట లేదా? పద్మాక్షియు అతని వీక్షించుచున్నదా?

తార్కికులు గాలి, ఆకాశము మొదలగు వానిని అమూర్తద్రవ్యములుగా పరిగణించిరి. పద్మాక్షీమతమున జగత్తంతయు అమూర్తమే. అద్వైతులుగూడ ఈశ్వరునకు రూపమున్నదని అంగీకరింతురు కాని, పద్మాక్షి అంగీకరింపదు. ఆమె పుట్టుగ్రుడ్డి.

పద్మాక్షి చూచుచున్నదో లేదో కాని ప్రద్యుమ్నుఁడు గ్రుడ్డివానివలె లోక మారయకున్నాఁడు. పద్మాక్షి మెలమెల్లగా లోనికేఁగెను. ప్రద్యుమ్నుని కపుడు కనులువచ్చెను. అవి యపుడు అతని హృదయమునుండి అననుభూతపూర్వమగు నొక తన్మయతను తోడుకొనివచ్చెను. అతనిమనస్సు చిగిరించెనో, లోపించెనోకాని అదియొక సుఖము, ఒక ఆవేదన, ఒక కాంక్ష, ఒక లబ్ధి, ఒక జన్మాంతరసంబంధము, ఒక అధునాతన ఘటన, ఒక లోపపూరణము, ఒక లోపము.

ఆత్మారాముఁ డగ్నిహోత్రగృహమునుండి వచ్చి, ప్రద్యుమ్నునాదరించి, యతని కులగోత్రాదులు ప్రశ్నించి సమాధానము పడసెను. తన కుమారుఁడు శశిచే లోఁగడ పలుమాఱులు భోజన సమయములందు గురుకులమునందలి మేధావులలో అతిమేధావి యని ప్రశంసింపఁబడువాఁడు ఇతఁడే యని గ్రహించి, 'నీ నామధేయము ప్రద్యుమ్నుఁడు కాదా?' అని ప్రశ్నింపఁగా లోనియక్క జమును వెలువరింపక ప్రద్యుమ్నుఁ డగు ననెను.

ఇంటిలో నుండి శశి వచ్చెను. ప్రద్యుమ్నుఁడతనిఁ జూచి 'మీ రెపుడు వచ్చితిరి?' అనెను. 'ఇదియే మాయూరు. మాయిల్లిదే' అని శశి తెల్పెను. 'ఏమీ! తన్నిన పరుపుపైఁ బడినటులు నేను సరిగా మీయూరే, విశేషించి మీయింటికే వచ్చితినే!' అని ప్రద్యుమ్నుఁ డు పలికెను. 'మా యదృష్ట'మని శశి పలుకుచు 'దొడ్డిలో దిగుడుబావి యున్నది. ఇంక స్నానముచేయుఁ'డని పండులు కోసికొని రా తోఁటలోని కేఁగెను. ప్రద్యుమ్నునకు దొడ్డిలోనికి దారిచూపి ఆత్మారాముఁడు అగ్నిహోత్రగృహములోని కేఁగెను.

ప్రద్యుమ్నుఁడు తరుల తావి తానపరివేష్టితమగు నా గృహోద్యానమున దిగుడు బావి కడ నిలుచుండి యింటిదెసఁ జూచుచుండెను.

ఓ ప్రథమప్రేమమా! నీవు ధన్యమవు! నీయందలి తన్మయత, శూన్యత – ఆవేదన, సుఖము – ఆశ, నైరాశ్యము లోనగు జంటలు గెంటెములవలె నెటులు కలిసియుండునో పిదప నెవఁడెఱుఁగును? ఆ ప్రథమాగ్నివలననే పదపటి వలపువత్తులన్నియు వెలిఁగింపఁ బడుచున్నవి. నీవు ఆవేశించిన పిదపనే పురుషుఁడు పురుషుఁడు, ఆఁడుది ఆఁడుది.

పిదప నిన్నందఱు స్మరించుకొందురుగాని నీవు గోచరింపవు. పూవెన్ని మాఱులయినను పూచుఁగాక! ఒకటే తావి. నీ తొలిపూఁదావికి పదపటి పూలతావికిని పోల్కియా?

ప్రద్యుమ్నున కాత్మారాముని యిల్లాలు ధాత్రి చేసిన గౌరవము అత్తగారుకూడ చేయఁజాలదు. ఆమె యతని విస్తరిలో నేతిగిన్నె జాఱవిడిచెను. శశి తెచ్చినపండ్లు పడఁద్రోసెను. ఇక్షురసము పోసెను. అతఁడును అల్లుని వలెనే అన్నింటిని కొంచెము కొంచెము రుచిచూచి యెక్కువ యెక్కువ పరిహరించెను.

శశి ప్రద్యుమ్నునకు పడుకొన శయ్య వైచెను. ఆ శయ్యపై నతఁడు మేలుకనియే కలవరించుచుండెను.

గృహోద్యానమున రసాలము క్రింద కూరుచుండి పద్మాక్షి - 'ఓ సూర్య భగవానుఁడా! నిన్నుపాసించు నాకు నీ కిరణ మొకటి మాత్ర మిమ్ము. ఒక్కసారి ప్రద్యుమ్నుని తిలకించి నీ కిరణమును మఱల నీ కిత్తును' అని మనస్సు నం దనుకొనుచుండెను. ఒకానొక తేజోదేవత తనహస్తమెత్తి 'ఇచ్చెదను లెమ్ము, ఇచ్చెదను లెమ్ము' అని పలికినటులు ఆమె వినెను. పద్మాక్షి అచటినుండి మఱికదలలేదు.

ప్రద్యుమ్నుఁ డచటినుండి ఒక అనిష్ట ప్రయాణము చేయవలసి వచ్చెను. అతఁడు తన కొల్లాయను, అంతరీయమును, ఉత్తరీయమును, ఒక పుస్తకమును మూటకట్టుటకు అంతము కానరాలేదు. తుదకు పుస్తకము క్రిందమఱచి మూట సమాప్తిచేసెను.

2

అతఁ డుదకము తెచ్చికొన దిగుడుబావికి వెళ్లెను. గృహాంతర్భాగమున కేఁగి ధాత్రికడ సెలవందెను. ఆత్మారామునితో 'పోయివచ్చెదను' అని మనవి చేసెను. అతఁ డాగృహమంతయు వెదకి వెదకి శూన్యమునే గ్రహించి వెలుపటికి వచ్చెను. శశికూడ నడుచుచుండెను. పదడుగులు వేసిన పిదప 'శశీ! పుస్తక మచట మఱచితిని' అనఁగా శశి యింటిలోని కేఁగెను. ప్రద్యుమ్నుం డాగృహారామము నంతయుఁ బరీక్షించు చుండఁగా ఎట్టెదుటనే రసాలము క్రింద తననే నిశితముగా నిరీక్షించు పద్మాక్షిని కనుఁగొనెను.

పద్మాక్షియొక్క దిదృక్షాసమాధి నిరవలంబ మాయెను. ఆమె కనులఁ జీల్చుకొని లోపలినుండి యొకజ్యోతి యుదయించెను. ఆజ్యోతిలో తజ్జ్యోతీరూపుఁడగు ప్రద్యుమ్నుని ఆమె కనుఁగొనెను. ఆమె కొక సర్వాంగీణ మగు ఆనంద ముదయించెను. అపు డామెలో నుండి వేలకొలఁది రతీదేవతలు జనియించు చున్నటు లుండెను.

శశి 'ఇదిగో పుస్తకము!' అనుచు వచ్చి ముందు దారి తీయఁగా వెనుక వెనుక చూచికొనుచు ప్రద్యుమ్నుఁడు పోవుచుండెను. కొంతవడికి "శశీ! 'ఆ వనాంతా దోదకాంతాత్' అని రెండును అయినవి. ఇఁక నీ వుండుము" అనెను. శశి చాల ఉపచార వాక్యములు చెప్పి వెనుదిరిగెను. ప్రద్యుమ్నుని శరీరము ముందఱికిని మనస్సు వెనుకకును ఒకతూరియే ప్రయాణము చేయుచుండెను.

3

'మా ప్రద్యుమ్నునకు మీ పద్మాక్షి నీయవలసిన'దని కోరుటకుఁగాను అన్వేషించు బ్రాహ్మణు లాత్మారామునిగృహము చేరుట కెన్నాళ్లో పట్టలేదు.

ఆత్మారాముఁ డామాట విననతోడనే ముఖమును చిట్లించుకొని పిదప అంగీకారము తెలిపెను. పాపము! పద్మాక్షి గ్రుడ్డిదని యాతఁ డెఱిఁగియుండఁడని ధాత్రి మనస్సు నందు మిగుల ఆవేదన నొందెను.

ప్రద్యుమ్నుఁ డంపిన బ్రాహ్మణులు పద్మాక్షీ సౌందర్యము ప్రద్యుమ్నునకు తగిన దని సంతసించిరి. సౌందర్యము స్త్రీయందే పర్యవసన్నమైనయెడల అది పద్మాక్షియందే యని వారు నిర్ధారించుకొనిరి.

పద్మాక్షి పదచలనముచేసి యెఱుఁగదు. ఆమె కిల్లే జగత్తు. ఇంట నీఁగ వాలుచో నామెకు వినఁబడును. కుటీరముపై తాటి యాకులలో ఏమాత్రము చప్పుడైనను దానికి కారణము కణుఁదురీఁగయో, ఉడుతయో, నలికండ్లపామో ఆమె చెప్పివైచును. ఇపుడింట కొన్ని క్రొత్తపాదములు నడుచుట మాత్రమే కాక వారేల వచ్చిరోకూడ ఆమెకు తెలియును.

పద్మాక్షి కనురెప్పలు మూఁతలుపడి యుండవు. గ్రుడ్లు కాయలు కాయలేదు. ఆమె నియతమగు నిమీలనోన్మీలనతాళమును వేయుచుండును. కాని భోజనానంతరమున ఆ బ్రాహ్మణులు ప్రద్యుమ్ను గుఱించి ఆత్మారామునితో చేయు ప్రసంగమును వినుచున్న పుడు పద్మాక్షిని చూచి నిజముగా గ్రుడ్డిదని చెప్పివేయవచ్చును. ఏలనఁగా ఆమెకనులు ప్రశాంతప్రాయములై చెవుల--నికి ముకుళించుకొని పోయినవి.

ఆత్మారాముఁడు వచ్చిన బ్రాహ్మణుల సత్కరించి వెంటఁబెట్టుకొని తోఁటలు, దొడ్లు, గిరులు, గహ్వరములు, ఏళ్లు, డొంకలు లోనగు ఆ యూరి సౌందర్యమంతయుఁ జూపించెను. అద్దాన వారికి గ్రామమున మఱి యెవ్వరితోడను మాటలాడ వీలు చిక్కలేదు.

రాత్రి భోజనమగు పిదప ఆత్మారాముని రక్తబంధువులు నలువురును అరుదెంచిరి. తాంబూలములు పుచ్చుకొనిరి. లగ్నము నిర్ణయించిరి. తెలవారుజాముననే లేచి బ్రాహ్మణులు వెళ్లిపోయిరి.

ఈ వివాహ మెటులు తుద నిగ్గునా యని యాత్మారాముఁ డావేదనపడఁ జొచ్చెను. ధాత్రికి గుండెలలో గుబులెత్తెను. శశవిషాణ ప్రాయముగా నున్నది శశికి.

పంచభూతముల గుణములలో నుండు సౌందర్యముతక్క వాని రూపసౌందర్య మెఱుఁగని పద్మాక్షి యిపుడు వారినీ 'భూమియెటులుండును? రూపము పొడుగా, పొట్టియా' అని యడుగుచుండెను. లోఁగడ భగవానునకు రూపము లేదనునామె యిపుడు రూప ముండును అని యనుచున్నది. గ్రుడ్డితనమునకు సౌందర్యము లేదన్నచో వివదించు నామె కిపుడదియు కొంచెము కొంచెము నచ్చినది.

దైన్యముతో తనకడకు వచ్చిన తల్లిని జూచి పద్మాక్షి – "అమ్మా! తీరవచ్చిన పెండ్లికొడుకు 'పెండ్లికొమార్త గ్రుడ్డి దనిచెప్పక పోయితి రే'మని అల్లరిచేసి లేచిపోవునేమో! పెండ్లికాకున్న నేమాయె? ఈ యవమానము మీరేల తెచ్చికొనవలయును? లోఁగడ తెలుపకున్నను ఇపుడేని వార్తనంపు"డని ముదలకించెను.

ఆత్మారాముని కనులవెంట రెండు భాష్పబిందువులు రాలెను. కొంతవడి కతఁడు 'అమ్మా! అతఁడే నిన్ను కోరుకొనెను. పెండ్లికి వత్తుమని వారే చెప్పిపోయిరి. మన దేమి లోటు? ఆ రెండు నిమిషములు నీ వూరకుండుము' అని యెను.

4

శశి తన రెండుచేతులతో పెండ్లి ప్రయత్నమంతయు కావించెను. తన శిష్యులు సమిత్తులఁ దెచ్చిరి; నీవారము లెండఁబోసిరి; తోఁటలో కూరగాయలు, పండ్లు సిద్ధపఱచిరి.

తనకు తప్పక ప్రద్యుమ్నుఁడే భర్త కాఁగలఁడను విశ్వాసమే వేయికన్నులుగా పద్మాక్షి తనలోఁ దా నానందించుకొనుచుండెను. ప్రద్యుమ్నునివలననే తనకు కనులు వచ్చునని యామె యేకసంకల్పము. కాని తాను గ్రుడ్డిదని యతనికి తెలుపకుండుట తీఱని లోపమని యామె నిశ్చయించుకొనెను. అమె తండ్రిని బిలిచి చెప్పెనుగాని యతఁడు వెనుకటియటులే చాఁచివైచెను.

తన యంగవైకల్యము తలిదండ్రుల గుణములకుఁగూడ వైకల్య మాపాదించినదని యామె గ్రహించినపు డామెమనస్సు ఉస్సురనిపోయెను. తలిదండ్రులకు తాను బరు వని తెలిసెను. 'ఓ పరిత్యాగమా! నీవే నాకు తల్లివి, తండ్రివి. నేను నీ చిన్నారి పొన్నారి బిడ్డను' అని దుఃఖించుచుండఁగా వీధిలో వేదపారాయణము వినఁబట్టెను.

ఆ వేదపారాయణముచేయువారు ప్రమోదుని శిష్యులు. వారుకాక పెండ్లివారు నలువురు : ఆమోదా ప్రమోద ప్రద్యుమ్నులు; నాల్గవవాఁడు పురోహితుఁడు.

లగ్న మాసన్న మాయెను. వధూవరులు మంగళస్నానము చేసిరి. వేదిక యలంకరింపఁబడెను. ముత్తైదువులు పూచిన తంగేడులవలె వేదిచుట్టు నిలువఁ బడియుండిరి. గణాధిపతిపూజ యాయెను. కొంతవడికి వరునికడకు గంపలో వధువు తీసికొనిరాఁబడెను. ఆమెకనులు పద్మములవలె వికసించియుండెను.

ఆమె లేచి నిలువఁబడి ప్రద్యుమ్నునకు నమస్కరించి – "దేవా! నా విన్నప మాలింప వలయు. మీరు లోఁగడ తెలిసికొని యుండరు. నేను గ్రుడ్డిదానను; పుట్టుగ్రుడ్డిదానను; ప్రకృతియంత గ్రుడ్డిదానను. కాని దేవరయే నాకన్ను" అనెను.

"ఏమీ! ఓరి ఆత్మారాముఁడా! మమ్ము వంచింపఁదలఁచితివిరా! నీ కులమంతయు గ్రుడ్డి దయిపోవుఁగాక!" అని శపించుచు ప్రమోదుఁడు లేచెను.

"ఓసి నిర్భాగ్యురాలా! ఈ రెండు నిముసములు నోరు మూసికొని పడియుండక యేల నాగొంతక కోసితి'వని లోపల ననుకొనుచు 'మీరందఱు చూచికొనిపోయి ఇపుడు తగవు లాటయా?' అని ఆత్మారాముఁడు లేచెను.

"ఛీ ఛీ, మీపిల్లయే 'మీరు లోఁగడ తెలిసికొనియుండ'రని చెప్పుచుండఁగా ఏల యసత్యము లాడెద"నని పండ్లుకొఱుకుచు "నీ వంశ మసత్య మగుఁగాక!" అని ప్రమోదుఁడు మఱల శపించెను.

ఆమోద ధాత్రిని చూచుచు లేచి నిలువఁబడెను. ధాత్రి తలవంచుకొని చేతులు పిసికికొనుచు కనులవెంట నీరుకాఱ అధోముఖియై కూరుచుండెను.

ప్రద్యుమ్నుఁడు నడుమ తెర తొలఁగించి పద్మాక్షిని చూచెను; ఆమె కనులు చూచెను; పద్మాక్షిని చూచెను. ఆమె యపుడతనికి కొచుకంపుకొట్టు ముత్తెపుఁ జిప్పవలెఁ దోఁచెను.

"ఏమి? చూచుకొనుట అయినదా?" అని ప్రమోదుఁ డనెను. అతఁడు పేరునకు ప్రమోదుఁడుగాని అసలు ప్రకోపుఁడని ప్రద్యుమ్నుఁడెఱుఁగకపోఁడు. అతఁ డాతెరను మెల్లగా జాఱవిడిచెను.

"ఇంక కూర్చుంటి వేమి? ఇంక నిలువఁ బడితి వేమి? ఈ గ్రామమున నుండరాదు. వట్టి బూటకము, వట్టి పాడు, లేచి రారేమి?" అనుచు ప్రమోదుఁడు వాకిటికి బయలుదేరెను. గ్రామవృద్ధు లతని శాంతింపఁజేయ నడ్డుపడిరి. వారి నందఱను పడఁ ద్రొక్కు కొనుచు ప్రమోదుఁడు పరశురాముఁడై పరిక్రమించెను. ప్రమదలు పతివర్తన విచేతనములచేఁ గూడ ప్రతిపన్నము కావున ఆమోద యతని ననుసరించెను. అటు ఇటు తోఁపక ప్రద్యుమ్నుఁడు వాకిటిలోని కొకొక్కయడుగే పెట్టుచు పద్మాక్షిని

చూచుచుండెను. పురోహితుఁడు మాత్రము ఆఁడు పెండ్లివారికడ దక్షిణకుఁ గాఁబోలు, ఇంకను పీఁటనుండి కదలలేదు.

"ఏమిరా! పెండ్లికూఁతురు ప్రకృతియంత గ్రుడ్డిదగుచో నీవు పురుషనంత కుంటివా? సాంఖ్య మేడిచితివికాఁబోలు!" అని ప్రమోదుఁడు కసిరికొట్టుచుండఁగా, 'అగును, పురుషనంత కుంటివానివలెనే యున్నాను' అని లోపల ననుకొనుచు ప్రద్యుమ్నుఁడు ప్రమోదు ననుగమించెను.

"వెతికి వెతికి మంచి సంబంధము తెచ్చికొంటివి! మాకు కనులు పోయిన వనుకొంటివా, నీవే వెతికికొనుటకు?" అని ప్రమోదుఁడు కుమారు నొకచఱవఁ బోయి చేయి వెనుకకు తీసికొనెను.

ప్రద్యుమ్నుని మనస్సు మనస్సులో లేదు. దిగుడుబావిలో పెద్ద చప్పుడాయెను. 'పద్మాక్షి యేది? పద్మాక్షి యేది?' అని సంకులధ్వని యుదయించినది. ధాత్రి పెద్దపెట్టున ఏడ్వమొదలిడెను.

'మన మిచట నుండరాదు, మన మిచట నుండరాదు' అనుచు ప్రమోదుఁ డామోదా ప్రద్యుమ్నుల వెన్నున చేయివైచి ముందరికి నెట్టెను.

అపు డాగృహదేవత తన సహస్రకంఠములతో ఉచ్చైస్స్వరముగా ఏడ్చెను.

ప్రద్యుమ్నుఁడు "నాయనా! నేను వివాహము చేసికొన కుండఁజాలను" అని నిలువఁ బడెను.

"ఓరి పిచ్చివాఁడా! ఆ గ్రుడ్డిది పరలోకమున కనులు కుదుర్చుకొనఁ బోయినదిరా. మాటలాడకు! రా రా" అని ప్రమోదుఁడనెను.

5

ఆరేయి శ్మశానమున ప్రద్యుమ్నుఁడును, అతని హృదయమున పద్మాక్షియు కూరుచుండియుండిరి.

ప్రభాత మగువఅకు అచట ఒక శల్యమేని లేదు. అంతయు నుసినుసి యైపోయెనని శశియు, ధాత్రియు, ఆత్మారాముఁడును దుఃఖించిరి.

కొంత కాలమునకు ప్రద్యుమ్నుఁడంధుఁడై తలిదండ్రులకుఁ గానిపించెను.

• *భారతి - జూన్ - 1927* •